
# మనస్వి



ఎం.వి.ఎస్.ఎస్. ప్రసాద్

రాత్రి తొమ్మిది గంటలయింది. వేసవికాలం కావడంచేత ఇంకా వేడిగానూ, ఉక్కగానూ ఉంది. నేను బస్సులో నాకు కేటాయించిన సీటులో కూర్చోగానే బస్సు బయలుదేరడంతో కాస్త ఊరట కలిగింది. క్రమంగా బస్సు వేగం అందుకోవడంవల్ల ఊరి పొలిమేరలు దాటడంవల్ల గాలి చల్లగా రాసాగింది. నాకు బస్సు ప్రయాణమంటే మొదటనుంచీ కూడా అయిష్టం. ఎప్పుడూ రైలులోనే ప్రయాణం చేస్తాను. కానీ అర్జంటుగా బయలుదేరవలసి రిజర్వేషన్లు దొరకకపోవడం వలన బస్సును ఆశ్రయించక తప్పింది కాదు. నేను నా సీటులో సౌకర్యంగానే కూర్చున్నాను. అయితే నిద్రాదేవత నా దరిదాపులకు రాదని నాకు బాగా తెలుసు. ప్రయాణంలో అందులోనూ బస్సు ప్రయాణంలో ఆ దేవతకూ, నాకూ మధ్య ఆమడదూరం. పగటిపూటయితే ఏ పుస్తకమో చదువుతూ గడిపెయ్యవచ్చు. కానీ రాత్రివేళ, బస్సులో ... వేసవిలో నా అవస్థ చెప్పనలవికాదు. కానీ నా అవసరం అలాంటిది. బయలుదేరక తప్పింది కాదు. బస్సు బయలుదేరేముందే డ్రైవరు ఎవ్వరూ సిగరెట్లు కాల్చకూడదని హెచ్చరించాడు. అది కొంతలో కొంత నయం. కనీసం సిగరెట్ల వాసన లేదు.

బస్సు వేగంగా ప్రయాణిస్తోంది. ఎవరో పసిగుడ్డు ఏడుపు లంకించుకుంది. తల్లి ఓదార్చడానికి విశ్వప్రయత్నం చేస్తోంది. ఒక సీటులో తాతగారు అదేపనిగా దగ్గుతున్నారు. ఒక

యువజంట గుసగుసలాడుకుంటూ, నవ్వుకుంటూ బస్సులో ఇంకా మనుషులు ఉన్నారనే ధ్యాస లేకుండా ఉన్నారు. నా ముందుసీటులో కాస్త వయసుమళ్లిన దంపతులు వాళ్ల పిల్లల గురించి, సమస్యల గురించి చర్చించుకుంటున్నారు. వాళ్ల సమస్యలు ఈరోజుల్లో సగటు వృద్ధ దంపతులకుండేవే అయినా కాస్త ఎక్కువ మోతాదులో ఉన్నట్లు అనిపించాయి. వాళ్ల మాటలనుబట్టి, వాళ్లకిష్టం లేకపోయినా పెద్దకొడుకూ- కోడళ్ల దగ్గరకి వెడుతున్నారని తెలిసింది. అయినా వాళ్ల చాదస్తం కానీ ఈ రోజుల్లో ఏ కొడుకు ఇష్టంగా తల్లిదండ్రులను తన దగ్గర ఉంచుకుంటున్నాడు? ఆవిడలో సర్దుబాటు ధోరణి కనిపిస్తోంది. ఆయనమాత్రం సమాధానపడలేకపోతున్నా డనిపిస్తోంది. మాటిమాటికీ ఆవేశపడుతున్నాడు. ఆవిడ ఏదో నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తోంది. అలా చాలా సేపు మాట్లాడుకుని, మాట్లాడుకుని నిద్రకు ఉపక్రమించారు ఆ ఇద్దరూ. ఇంచుమించు బస్సులో అందరూ నిద్రావస్థలో ఉన్నారు. బస్సు డ్రైవ్ చేస్తున్న డ్రైవరు, నిద్రపట్టని నేనూ నిశాచరులలా మెలకువగా ఉన్నాం. బస్సు కొన్నిచోట్ల ఆగడం, డ్రైవరు మారడం ఇత్యాదులు యథావిధిగా జరిగాయి. నిద్రపోతున్నవాళ్లు లేచి టీ తాగి మళ్లీ నిద్రకుపక్రమించారు. ఏ నిద్రా రాని నేను అలవాటు లేని కారణంగా టీ తాగలేదు. ఇంకా రెండు గంటలలో బస్సు గమ్యస్థానం చేరుకుంటుంది, నేను వెళ్లవలసిన ఊరు చేరుకుంటాను. 'హమ్మయ్య!' అనుకున్నాను.

ఆ స్టాపులో ఆగి బస్సు బయలుదేరింది. ఊరు దాటిన తరువాత చిట్టడవి. అప్పుడప్పుడూ దొంగలు బస్సులను, ఇతర వాహనాలనూ ఆపి బెదిరించి దొంగతనాలు చేస్తూండడం పరిపాటి. కానీ తెల్లవారుజామున నాలుగు గంటలు దాటడంవలన ఆ భయం పెద్దగా ఉండదనిపించింది.

బస్సు వేగంగా పోతోంది. ఉన్నట్లుండి, "అమ్మా!" అన్న గావుకేక, మూలుగూ వినిపించాయి. బస్సులో వారందరిలోనూ భయాందోళనలు నెలకొన్నాయి. డ్రైవరు బస్సు వేగం తగ్గించాడు. లైట్లు వేశాడు. మూలుగు పెద్దగా వినిపించసాగింది. బస్సు ఆగింది. డ్రైవరు, కండక్టరూ నా ముందుసీటు దగ్గరకి వచ్చి ఏమైందని ప్రశ్నించారు. ముసలాయన సమాధానం చెప్పే స్థితిలో లేడు కాబోలు వాళ్ల ప్రశ్నకు మూలుగే సమాధానం అయింది. ఆవిడ మెల్లగా ఏదో

> ఏ మానవత్వం ఉన్న మనిషి అయినా సాటి మనిషి ప్రాణం కాపాడడానికి తన చేతనైన సహాయం చెయ్యాలి. నేను చేసినది అదే ... నేను ఆడిన అబద్ధం ఎవ్వరికీ ఏ విధమైన హానీ చెయ్యలేదు. ఒక ప్రాణం కాపాడింది!



చెప్పింది. ఆవిడ చాలా కంగారుపడిపోతోంది.

"ముసలాయనకు గుండె నొప్పిగా ఉందట!" బస్సులో ఉన్నవాళ్లందరినీ ఉద్దేశించి అన్నాడు కండక్టరు.

నేను ఒక్క ఉదుటున లేచి నుంచున్నాను. ముసలాయన ఛాతీని చేతితో పట్టుకుని మెలికలు తిరిగిపోతున్నాడు. ఒళ్లంతా చెమటతో తడిసి ముద్దవుతోంది. ఊపిరి భారంగా తీసుకుంటున్నాడు. ఆయన ముఖంలో భయం, ఆందోళనా ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. నా అంతరాత్మ నాకు కర్తవ్యాన్ని బోధించింది. వెంటనే ముందుకు జరిగి ఆయన చేతిని అందుకుని పల్స్ చూడటం ప్రారంభించాను.

"మీరు డాక్టరా సార్?" సంభ్రమంగా ప్రశ్నించాడు డ్రైవరు.

నేను తలూపి, "ఇంకా ప్రయాణం ఎంత?" అని అడిగాను. దానికి సమాధానంగా ఒక గంట ఉంటుందని డ్రైవరు చెప్పాడు. వెంటనే బస్సుని స్టార్ట్ చెయ్యమని, వీలైనంత వేగంగా బస్సుని పోనిమ్మని డ్రైవర్‌కి చెప్పాను.

ఓ మ్యూజియంలో ఈజిప్షియన్ మమ్మీని చూసిన గోపి, "దానికింద అంకెలు వేసి ఉన్నాయేంట్రా?"




అనడిగాడు.

"బి.సి.1344...అంటే వీడిని గుద్దేసిన లారీ నెంబరు అన్నమాట." చెప్పాడు గోవిందం ఆ అంకెలు చదివి.

- కలపర్తి సత్యం, ఏలూరు

"మీ బాధేమిటి సార్?" అని అడిగాను ముసలాయనను.

"గుండెల్లో నొప్పి! భరించలేకపోతున్నాను!" అన్నాడాయన.

"అమ్మో, అంత ముసలాయనకి గుండె నొప్పి వస్తే బతకడం కష్టం!" అన్నారెవరో.

ఇంకేదో అనబోతుండగా నేను అటుకేసి చెయ్యి చాచి వారించాను. మాట్లాడవద్దని సంజ్ఞ చేశాను.

నేను మళ్లీ పల్స్ పరిశీలనగా చూశాను.

"మీ బాధేమిటి? ఎప్పటి నుంచి ఇలా ఉంది? ఇంతకు ముందెప్పుడైనా ఇలా వచ్చిందా?" అని అడిగాను.

"ఇంతకు ముందెప్పుడూ ఇలా లేదు ... ఒక్క అయిదు నిముషాలనుంచి, బాబూ ... గుండె నమిలేస్తోంది!" ఆగి ఆగి చెప్పాడాయన.

"అలాగా ... నేను అనుకోకుండా అర్జంటుగా బయలుదేరడంచేత స్టెత్ కూడా తెచ్చుకోలేదు. మీది పెద్ద ప్రాబ్లమేదీ కాదనిపిస్తోంది!" అంటూ ఆయన దుస్తులను వదులు చేసి సీటులో పడుకోబెట్టాను. ఆయన భార్యను నా సీట్లో కూర్చోమన్నాను. ఆయనను మళ్లీ పరీక్షించడం ప్రారంభించాను.

పల్స్ దీక్షగా గమనించాను. ఊపిరి పీల్చుకునే విధానం, రేటు పరీక్షించాను. కళ్లు పరిశీలించాను. గుండెలమీద, కడుపుమీద చెయ్యి అనించి చూశాను. జనం అందరూ నన్నూ, ఆయన్నీ ఊపిరి బిగబట్టి చూస్తున్నారు.

"సార్! మీకేమీ భయం లేదు, కంగారు పడకండి!" అన్నాను నేను.

"బాబూ! గుండెల్లో ... నొప్పి ...!" ఏదో చెప్పబోయాడు ఆయన.

నేను ఆయనను మాట్లాడవద్దని సంజ్ఞ చేశాను.

"మీకేమీ లేదు. హాయిగా, విశ్రాంతిగా పడుకోండి. నేను చూస్తున్నాను కదా!" అంటూ మళ్లీ పల్స్ చూడటం ప్రారంభించాను.

రెండు నిమిషాలు గడిచాయి.

"బాబూ! ఇది హార్ట్ ఎటాక్‌లాంటిదేమీ కాదు కదా!" ఆత్రుతగా అడిగాడాయన. ఆయన స్వరంలో ఆందోళనా, భయం ప్రస్ఫుటంగా కనిపించాయి.

"ఏమిటి సార్? చిన్న దానికి అంత ఇదిగా ఊహించేసుకుంటున్నారు? మీ గుండెకు వచ్చిన నష్టమేమీ లేదు. అది శుభ్రంగా పనిచేస్తోంది. ఇక మీ నొప్పి అంటారా ... అది గుండెకు సంబంధించినది కాదు. కేవలం అసిడిటీ వల్ల వచ్చిన నొప్పి. రెండు రోజులు అంటాసిడ్లు

వేసుకుంటే అదే తగ్గిపోతుంది. మీరు అనవసరంగా ఆవీ ఇవీ ఊహించుకుని వర్రీ అవకండి!" అన్నాను నేను.

ఆయన ఏదో చెప్పబోయాడు.

"మాట్లాడకండి! జస్ట్ రిలాక్స్!" అన్నాను నేను ఆయన చేతిని పట్టుకుంటూ.

"డాక్టరు గారూ ... మరేం భయం లేదుగా?" ఆయన భార్య ఆదుర్దాగా అడిగింది.

"ఏమీ ఫరవాలేదమ్మా! అది కేవలం అజీర్ణం వలన వచ్చిన నొప్పి. దానిగురించి మీరు గానీ, ఆయనగానీ కంగారుపడాల్సిన పని లేదు!" అని ధైర్యం చెప్పాను.

బస్సు అడవిగుండా వెడుతోంది.

ముసలాయన ముఖంలో ఆందోళనా, కంగారూ ఇంకా తొంగిచూస్తూనే ఉన్నాయి.

"సార్! మీరింకా ఆందోళనగా ఉన్నారేమిటి? హాయిగా కళ్లు మూసుకుని పడుకోండి!" అన్నాను నేను సీటుకానుకుంటూ.

"ఫరవాలేదంటావా...?"

"మీకేం కాలేదు. ఒక డాక్టరుగా చెప్తున్నాను, సరేనా? మీది వెరీ మైనర్ ప్రాబ్లెమ్. అసిడిటీకి అంత కంగారు పడతారేమిటి? హాయిగా రెస్ట్ తీసుకోండి, సార్!" అన్నాను అనునయంగా ముసలాయన నుదుటిమీద చెయ్యి వేస్తూ.


ఆయన కళ్లల్లో ఆందోళనా, ఆదుర్దా తగ్గాయి.

నిమిషాలు గడుస్తున్నాయి.

"డాక్టరుగారూ! ఏమన్నా మందులు ఇవ్వలేకపోయారా?" అని ప్రశ్నించాడు కండక్టరు.

"నా దగ్గర పెద్దగా మందులు లేవు. అదీ కాక ఆ వయసులో ఆయనకి ఏ మందు పడితే ఆ మందు వాడకూడదు!" అన్నాను నేను అతని ప్రశ్నకు సమాధానంగా.

"ఆహాఁ..." అన్నాడు కండక్టరు.



"మనిద్దరికి ఇక్కడినుంచి తెనాలికి ఏభై రూపాయలు తీసుకున్నాడు." టికెట్ కౌంటర్‌లోనుండి బయటకు వస్తూ చెప్పాడు భర్త భార్యతో.

"వాడెంత చెబితే అంత పెట్టి కొనెయ్యడమే...బేరం ఆడవద్దుటండీ. అందుకే మిమ్మల్ని మట్టిబుర్ర అనేది."

- కలపర్తి సత్యం, ఏలూరు

నేను చేసిన పరీక్షలు, చెప్పిన మాటలు ముసలాయనకి ఊరట కలిగించాయనుకుంటాను. బాధలో ఉన్నా రిలాక్స్‌డ్‌గా కనిపించాడు.

ఊరి పొలిమేరలకు రాగానే ముందుగా హాస్పటల్‌కు బస్సును పోనిమ్మన్నాను డ్రైవర్‌తో.

హాస్పటల్ చేరగానే నేను డ్యూటీ డాక్టరుతో మాట్లాడి ముసలాయనను అడ్మిట్ చేశాను. ప్రాథమిక పరీక్షల అనంతరం కార్డియాలజిస్ట్‌కు కబురు వెళ్లడం, ఆయన క్షణాలలో రావడం జరిగింది. కార్డియాలజిస్ట్ ముసలాయనను పరీక్షించి ట్రీట్‌మెంట్ స్టార్ట్ చెయ్యడం జరిగింది. నేను ఆలోపే ఊళ్లో ఉంటున్న పేషెంట్ కొడుకుని ఫోన్ చేసి పిలిపించాను. ముసలాయన పరిస్థితి కుదుటపడ్డ తరువాత నేను ఆయన భార్య, కొడుకుల దగ్గర సెలవు తీసుకుని బయలుదేరాను.

"చాలా థాంక్స్ డాక్టరుగారూ! మీరెంతో సహాయం చేసి ఆయన ప్రాణం కాపాడారు!" అంది చేతులు జోడిస్తూ ఆయన భార్య.

"దానిదేముందండీ ... నేను చేయగలిగిన సహాయం చేశాను."

"అలా అనకండి ... మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేం, డాక్టరుగారూ!" అందామె కృతజ్ఞతా పూర్వక అశ్రునయనాలతో.

"ఒక మనిషిగా నేను చేయగలిగిందీ, చేయవలసిందీ చేశాను!" అన్నాను నేను.

ఇద్దరికీ చేతులు జోడించి బయటకు బయలుదేరాను.

ఆ హస్పిటల్ మేడమెట్లు దిగుతూంటే ఆలోచనలు నా మస్తిష్కంలో ప్రవేశించాయి.

నేను వాళ్లని మోసం చేశాను. నేను ఒక డాక్టరును అని అబద్ధం చెప్పాను. నేను డాక్టర్‌ని కాను. కనీసం వైద్యంలో ఏబీసీడీలు కూడా నాకు తెలియవు. కానీ ఆ పరిస్థితిలో ... నేను ఆలోచించే ఆ పని చేశాను. అలా ప్రవర్తించాను. అలా డాక్టరులా నాటకం ఆడాను. ముసలాయన పరిస్థితిని చూసి హార్ట్ అటాక్ అని అనుమానం వచ్చింది. మేమున్న ప్రదేశానికి దరిదాపులలో డాక్టరు దొరికే అవకాశం లేదు. కనీసం గంట ప్రయాణం చేస్తే గానీ డాక్టరు గానీ, హాస్పిటల్ గానీ దొరికే అవకాశం లేదు. బస్సులో ఎవరూ డాక్టరు లేరని తెలిసింది ... ఆ సమయంలో ముసలాయనకి వైద్య సహాయం ఎటూ దొరకదు ఇక ఆ వ్యక్తికి కావాల్సినవి ధైర్యం, ప్రశాంతత. అవి నూరిపోయాలనుకున్నాను. నిజానికి ఆ పరిస్థితులలో అంతకన్నా చెయ్యగలిగింది ఏమీ లేదు. ఒక సామాన్య వ్యక్తికన్నా ఒక డాక్టరు చెప్తే రోగికి ఎక్కువ నమ్మకం, ధైర్యం కలుగుతాయి. అందుకని డాక్టరు అవతారం ఎత్తాను. ఆయనకు వీలైనంత ధైర్యం చెప్పాను. ఆయన కంగారుపడకుండా ప్రశాంతంగా ఉండేలా చూశాను. బహుశా ఆ ధైర్యం, ప్రశాంతత ఆయన ప్రాణం కాపాడి ఉండవచ్చు.

ఏ మానవత్వం ఉన్న మనిషి అయినా సాటి మనిషి ప్రాణం కాపాడడానికి తన చేతనైన సహాయం చెయ్యాలి. నేను చేసినది అదే ... నేను ఆడిన అబద్ధం ఎవ్వరికీ ఏ విధమైన హానీ చెయ్యలేదు. ఒక ప్రాణం కాపాడింది!

మానవత్వం ఉన్న మనిషిగా ఒక ప్రాణాన్ని కాపాడగలిగాననే ఆత్మతృప్తి, ఆనందం నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తూండగా హాస్పిటల్ బయటకు నడిచాను. ■

